సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
బుధవారం, జూన్ 12, 2024
డిజిటల్



# పార్లమెంట్ సమావేశాలకు
# డేట్ ఫిక్స్

## 24నుంచి జూలై 3వరకు నిర్వహణ

## 24, 25 తేదీల్లో ప్రమాణ స్వీకారం చేయనున్న ఎంపీలు

2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సంపూర్ణ మెజార్టీతో గెలుపొందింది. దీంతో కూటమి అభ్యర్థిగా మోడీ మూడోసారి ప్రధానిగా ఈ నెల 9 ప్రమాణ స్వీకారం చేశారు. మరో 71 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 17 లోక్ సభకు ఎన్నికైన ఎంపీలను ప్రమాణ స్వీకార కోసం పార్లమెంట్ సమావేశాలకు డేట్ ఫిక్స్ చేశారు. ఈ నెల 24 నుంచి జూలై 3 వరకు ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కొనసాగనున్నాయి. ఇందులో జూన్ 24, 25 తేదీల్లో పార్లమెంట్ కు ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 26న లోక్ సభకు కొత్త స్పీకర్‌ను ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం 10 రోజుల పాటు సాగే ఈ సమావేశాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందోననే చర్చలు సాగుతున్నది. ప్రతిపక్షాలు మాత్రం నీట్ లీకేజీపై ప్రభుత్వాన్ని నిలదీయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో పార్లమెంట్ సమావేశాలు రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తుంది.

- తెలంగాణ ప్రభ, ఢిల్లీ

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342



## సీఎంని కలిసిన రేవంతన్న సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** రేవంత్ సైన్యం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా తన పుట్టిన రోజు సందర్భంగా జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించి నరసింహకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## టీజీపీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డు గ్రహీత తిరుపతికి సన్మానం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కు అవార్డు పంపిణి జూన్ 05 "ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని" పురస్కరించుకొని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అవార్డులు ప్రధానం చేయడం జరిగినది. ఈ అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా కోరుట్ల పురపాలక సంఘం టీజీపీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డుకు ఎంపిక కాబడినది. ఇట్టి అవార్డును హైదరాబాద్ లో ఏ వాణీ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఈఎఫ్ఎస్టీ చేతుల మీదుగా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి అందుకున్నందుకుగాను మంగళవారం కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిని, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ గోనెల మహేష్ ను మున్సిపల్ సిబ్బంది శాలువాతో సన్మానించారు.

# పాలిటెక్నిక్‌తో ఉద్యోగ అవకాశాలు

## పోపా ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ర్యాంకర్లకు అవగాహన సదస్సు




**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** పద్మశాలి ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో ఈ రోజు పాలిటెక్నిక్ ర్యాంకర్లకు ఉచిత అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ హాజరై మాట్లాడారు. పాలిటెక్నిక్ డిప్లొమా తో అద్భుత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. జీవితంలో త్వరగా ఉద్యోగంలో స్థిరపడే అవకాశాలు పాలిటెక్నిక్ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. కంప్యూటర్ డిప్లొమా కోర్సుల గురించి వివరిస్తూ ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నా అదే మొత్తంలో పోటీ కూడా ఉందని అన్నారు. బేసిక్ కోర్ కంప్యూటర్స్ పై ఉద్యోగాలు కేవలం 25 శాతం మాత్రమే వుంటాయని, మిగతా బ్రాంచుల్లో చదివిన వారు సైతం కంప్యూటర్ ఉద్యోగాల్లో స్థిర పడేందుకు మెండుగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అపోహలు, ఊహలు మాని వాస్తవికతతో తమ అభిరుచికి అనుగుణంగా మాత్రమే కోర్స్ లను సెలెక్ట్ చేసుకోవాలని అన్నారు.



విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కోర్స్ ఎంపికనే ఉద్యోగంలో కీలకం అని అన్నారు. టెక్స్ టైల్ డిప్లొమా హెడ్ ప్రభాకర చారి మాటడుతూ టెక్స్ టైల్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, సృజనాత్మతను కోరుకునే వారు టెక్స్ టైల్ డిప్లొమా కోర్సు ను సెలెక్ట్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సు మన రాష్ట్రంలో కేవలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పోపా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ మాట్లాడుతు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అత్యంత ముఖ్యమైనదన్నారు. లక్ష్యం చేరాలంటే అవగాహననే కీలకంగా వుంటుందని తెలిపారు. మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతు పోపా ద్వారా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గర్వకారనంగా ఉందన్నారు. పద్మశాలి సమాజంలో నూతన ప్రేరణకు నాందిగా పోపా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోపా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, సభ్యులు గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం,వాసాల హరిప్రసాద్, ఆంకారపు జ్ఞానోభా, కనుకుంట్ల తిరుమల, కొడం శ్రీనివాస్, దేవత ప్రభాకర్, దాసు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మంగళవారం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో సిరిసిల్లలో జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శంకర్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ ప్రకటించడం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేసి, సెమీ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం సర్వీస్ పర్సన్స్ ను నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని,సిపిఎస్ రద్దు కొరకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రమేష్, జిల్లా కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శులు ఆడెపు శివకుమార్, జంగిటి రాజు బాధ్యులు లక్ష్మణ్, నరేష్, సతీష్ మొదలైన వారు పాల్గొన్నారు.






## చెత్తను సక్రమంగా సేకరించాలి

### మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల మున్సిపల్ ఆఫీస్ లో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే ఆటో డ్రైవర్లకు మీటింగ్ నిర్వహించి, ప్రతిరోజు డోర్ టు డోర్ చెత్తను కలెక్షన్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించడం జరిగింది . రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని చెత్తను ప్రతి ఇంటినుంచి సక్రమంగా సేకరించాలని, లేనియెడల అంటూ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారిని హెచ్చరించడం జరిగింది. వార్డు ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ డ్రైవర్లు పాల్గొనడం జరిగింది.




# బీఆర్ఎస్‌లో ఐరన్ లెగ్ పాడి కౌశిక్


## పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుండి పార్టీలో పనిచేసిన కార్యకర్తలను పక్కన బెట్టి హుజురాబాద్ లో ఆత్మహత్య పేరుతో చావుతప్పి లొట్టపోయినట్టు గెలిచిన కౌశిక్ ను కేసీఆర్ టైగర్ గా సంబోధించడం వల్లనే పార్లమెంట్ లో కొట్లాడి తెచ్చిన బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ దుయ్యబట్టారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ నాడు తెలంగాణ అంటే కేసీఆర్,కేసీఆర్ అంటే తెలంగాణ ఉన్న పార్టీలో కుటుంబ పాలనను వ్యతిరేకించినందుకు ఈటెల రాజేందర్ ను గెలవడానికి ఐరన్ లెగ్గు పాడి కౌశిక్ లాంటి ఉద్యమ ద్రోహులను ప్రోత్సహించి, హుజురాబాద్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ పతనానికి బీజం వేసుకున్నారని, జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించి, రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రజల మన్ననలు పొందుతున్న పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను ఓర్వలేక, అక్కసుతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ విమర్శలకు దిగడం దిగజారుడుతనానికి పరాకాష్ట. ఇటువంటి ఐరన్ లెగ్ నాయకుల వల్ల ఇప్పటికే బీసీలకు దూరమై అధికారం కోల్పోయిన కేసీఆర్ స్థాపించిన పార్టీ ఎగ్జిట్ అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మల్లేశ్వర్ జోస్యం చెప్పారు. గతంలో రాజకీయ పార్టీల్లో ఐరన్ లెగ్గుల ను ప్రోత్సహించిన ఆయా పార్టీలు భ్రష్టు పట్టి పోతాయనేదానికి ఆంధ్రప్రదేశ్ ఎన్నికలే ఉదాహరణ అంటూ అభిప్రాయపడ్డారు, 23 సంవత్సరాల అనుభవం గల బీఆర్ఎస్ పార్టీకి టైగర్లు ఎవరు? గోడమీద పిల్లులు ఎవరు? అనేది తెలియనంత కాలం అట్టడుగు వర్గాలు దూరమవడం ఖాయం. ఇప్పటికే కేసీఆర్ కోటరీ కారణంగా తెలంగాణ సమాజం ఈసడించుకొని పార్లమెంట్ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టిన విషయం గుర్తెరుగుతే మంచిదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ హితబోధ చేశారు. సమావేశంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చందా మల్లయ్య, పాస్ రాష్ట్ర నాయకులు బూర విద్యాసాగర్, మెరుగు బాబు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంను కలిసిన రాంకుమార్

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కుత్బుల్లాపూర్ యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బత్తిన రాంకుమార్ గౌడ్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు.




## ఉద్యోగిని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** బోధన్ లోని ఈవెంట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉద్యోగ పదవి విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో గత 39 సంవత్సరాలుగా ఉ ద్యోగరీతిలో ఉంటూ అంకిత భావంతో పనిచేసి సేవల ను అందించి అందరి మన్ననలు పొందిన వ్యక్తి మం దుగుల విద్యాసాగర్ నేడు పంచాయతీరాజ్ విభాగం నుండి మంగళవారం ఉద్యోగ పదవి నుండి విరమణ పొందిన శుభ సందర్భంగా మందుగుల విద్య సాగర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోపు సాయిలు ఆధ్వ ర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యాసాగర్ దంపతుల ఫోటోను వారి గుర్తుగా ఆయనకు బహుకరించారు. వారు మాట్లాడుతూ.. విద్యాసాగర్ దంపతులు సుఖసంతోషాలతో నిండు నూరేళ్లతో వారి కుటుంబ సభ్యు లతో జీవితం సంతోషంగా గడపాలని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ గోపు సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు దేగం సాయిలు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి నాగేశం, ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణుల సామూహిక సీమంతం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండలంలోని చేత నగర్ అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు అంగన్వాడి సూపర్వైజర్ మనీ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లతో కలిసి గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శ్రీమంతం కార్యక్రమం సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ మనీ మాట్లాడుతూ...ఉమ్మడి మండలంలోని ప్రతి అంగన్వాడి కేంద్రాలలో గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అన్నారు. గర్భవతికి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని గర్భవతులకు సూచించారు. ప్రతి నెలలో గర్భవతి 4 ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పాలు గుడ్డుతో పాటు భోజనాన్ని సెంటర్ నందు గర్భవతులకు తినే విధంగా ప్రోత్సహించి తినిపియ్యాలని అంగన్వాడీ టీచర్ కు ఆదేశించారు. గర్భవతులకు ఆకుకూరలు కూరగాయలు, మునగ తోటకూర పాలకూర ఎక్కువగా తిన్నచో రక్తహీనతను నివారించవచ్చు అన్నారు. టీటీ ఇంజక్షన్ లు గర్భవతులు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దుర్పత బాయి, రాజ్యలక్ష్మి ,కళావతి, ఏఎన్ఎం సవిత, ఆశ కార్యకర్త రేష్మ బేగం, అంగన్వాడి ఆయమ్మ డి. నవీన పిల్లల తల్లులు, కిశోర బాలికలు, బాలింతలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## స్వీట్‌హౌస్, బేకరీ, హోటల్లో తనిఖీలు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆదేశాల మేరకు పట్టణంలో గల స్వీట్ హోమ్, బేకరీలు, హోటల్స్ లలో తనిఖీలు నిర్వహించి పరిశుభ్రత పాటించని యజమానులకు జరిమానాలు విధించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ పట్టణంలోని స్వీట్ హోమ్ లు, బేకరీలు, హోటళ్ళు, రెస్టారెంట్లు నిర్వహించే యజమానులు రాబోయే వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని అంటూ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన పరిశుభ్రమైన తాజా ఆహారాన్ని మాత్రమే ప్రజలకు విక్రయించాలని, మరియు నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలియజేయడం జరిగింది లేనిపక్షంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడంతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధించడంతోపాటు, చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. ఈ తనిఖీలలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్,రమేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## ఆర్డీవో ఆఫీస్ మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏ.ఐ.టి.యు.సి. ఆధ్వర్యంలో బాన్సువాడ ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమమం సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ.... వంట కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని, వివిధ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, అయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు 10వేల రూపాయల గౌరవ వేతనం చెల్లించాలని ఆయన ఆర్డీవో కోరారు. వంట సరుకులను గ్యాస్ కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, స్లాబ్ రేటును 25 రూపాయలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎండి. ముస్తఫా, నీలాబాయి, స్వరూప, మల్లమ్మ, సాయన్న జయన, సుంకు బాయ్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యేకి

# ఘన సన్మానం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి విదేశీ( అమెరికా) పర్యటన ముగించుకొని తిరిగి స్వదేశానికి వచ్చిన శుభ సందర్భంగా ఆయనకు హైదరాబాదులోని శంషాబాద్ విమానాశ్రయంలో పోతంగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి పుప్పాల శంకర్ ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఏనుగు రవీందర్ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నవారు డిసిసి ఉపాధ్యక్షులు గంగాధర్ దేశాయ్, కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాహిద్, గంధపురాజు చాంద్ పాషా, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ పోషకులకు విలువ లేదా?


## డాక్టర్ కందేపి రాణీప్రసాద్

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో సాహితీ పోషకులకు చోటు లేదా! తెలుగు చరిత్రలో ఒక పేజీ సాహితీ పోషకులకు కేటాయిచలేరా! కష్టపడి సంపాదించిన ధనాన్నీ సమయాన్నీ సాహిత్యం కోసం, సాహితీ కార్యక్రమాల కోసం ఖర్చుపెట్టే సాహితీ పోషకులు, కళా పోషకులకు విలువ లేదా? అంటే లేదనే చెప్పాలి! ప్రోలయు వేమారెడ్డి, మనుమసిద్ధి వంటి ప్రభువులు లేకుంటే కవిత్రయం ఆంధ్ర సాహిత్యానికి తెలిసేవారా? సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు లేకుంటే అష్ట దిగ్గజాలు తెలుగు ప్రజలకు లభించేవారా? ఇంతటి ఘన చరిత్రను పెట్టుకుని కూడా సాహితీ పోషకులను ఎందుకు గుర్తించడం లేదు.

"సాహితీ ప్రియులు, సాహితీ పోషకులు లేకుంటే ప్రతి రోజూ ఇన్ని సాహితీ కార్యక్రమాలు జరిగేవా? కవులు తాము రాసిన అక్షరాలకు శాశ్వతత్వం కల్పించడానికి సాహితీ ప్రియుల అండనే కోరతారు. అలాగే రచయితలు రాసిన కావ్యాలకు పురస్కారాలనే గుర్తింపు సైతం కొంత మంది పెట్టిన దయా భిక్షే, నాలుగు ముక్కలు రాసిన రచయితలు సైతం తమను ఎవరో గుర్తించాలనీ, సన్మానాలు చేయాలని ఆశపడుతారు. వారి యొక్క ఇలాంటి ఆశల్ని తీర్చడానికి సాహితీ సంస్థలు ఏదో ఒక్క కార్యక్రమాన్ని డిజైన్ చేస్తారు. ఈ కార్యక్రమం సుజావుగా సాగాలంటే దానికి ధన సహాయం చేసే దాత కావాలి. దాతల దగ్గర తెచ్చిన సొమ్ము తోనే వ్యాఖ్యాతల అందమైన మాటలు గానీ రచయితల భావాత్మక అక్షరాల కూర్పులు గానీ శాశ్వతత్వాన్ని పొందుతాయి. ఆయా దాతలకు దయా స్వభావమే లేకుంటే రచయితల భావాలు మనసులోనే ఉండిపోతాయి. వ్యాఖ్యాతల వాగ్బాణాలు గొంతులోనే ఉండిపోతాయి. సాహిత్యమంటే విపరీతమైన అభిమానం, దయ ఉండే దాతల వలనే వెయ్యేళ్ళ క్రిందటి సాహిత్యాన్ని ఈ రోజు కూడా చదువుకోగలుగుతున్నాం. ఏ సాహితీ, సభలోనైనా వారి గురించి మాట్లాడుతున్నారా?. వేలు, లక్షలు ధారపోసి కొంతమంది తమ ఆస్తుల్నే తగలేసి సాహిత్యం కోసం రేయింబవళ్ళ కష్టపడి కాపాడుతుంటే ఒక్కరైనా వారి గురించి తలుస్తున్నారా?.

రెండు వాక్యాల్ని రాసినా కవిగా ముద్ర వేస్తున్నారు. పది కవితలు రాయగానే సన్మానాలు చేస్తున్నారు. సన్మానాలు, పురస్కారాలకు కవులు అమితానందం పొందడమే గానీ తమకు ఇంత గౌరవాన్నీ, గుర్తింపునూ తెచ్చిన దాతల్ని ఎప్పుడైనా తలచుకున్నారా? రచయితల మొహంలో వెలుగు చూడటం కోసం దాతలు తమ ధనాన్ని ధారపోస్తుంటే అదేదో వాళ్ళ దగ్గర మిగిలిపోయిన బ్లాక్ మనీ అనుకుని ఉదాసీనంగా ఉంటారు. బ్లాక్ మనీ ఉండే గొప్ప వాళ్ళు పార్టీలు, ఫంక్షన్లు చేసుకుంటారు గానీ సాహితీ కార్యక్రమాలు, కళార్చనలూ చేయరు. కళలు, సాహిత్యం పట్ల విపరీతమైన ఇష్టం. అభిమానం ఉన్నవారే ఈ కార్యక్రమాలకు నడుం కడతారు. ఒకవేళ వారికి డబ్బు ఎక్కువైతే ఈ సాహితి కార్యక్రమాలు మాత్రమే చేయాలా? బయట అనాథలు, వికలాంగులు, వృద్ధులు ఎంతో మంది తినడానికి తిండి లేకుండా ఉన్నారు. వారందరికీ సహాయం చేసి సంతోష పడేవారు కదా! అదీ కాకుండా కవుల, రచయితల రచనల్ని వెలుగులోకి తెచ్చే మహానుభావులు మన తోటి సమానంగా ఉండే మామూలు వ్యక్తులే. ధనంలో పుట్టి పెరిగిన ధనవంతులు కాదు. సాహిత్యాన్ని జీర్ణించుకున్న మధ్య తరగతి జీవులే. వారి కళాదృష్టికి సాహితీ ప్రియత్వానికి కనీసం ఒక్క మంచి మాట నోచుకోదా!.

కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో సబ్జెక్టు పరంగా విద్యార్థులకు ఇచ్చే గోల్డ్ మెడల్స్ సైతం ఎవరో వ్యక్తులు ఇచ్చే ధన సహాయాలే. అక్కడ నామ మాత్రంగా పేరు చెప్పి వదిలేస్తారు. బహుమతి గ్రహీతలు కుటుంబ సభ్యులతోనూ, స్నేహితులతోనూ హాజరవుతారు. బహుమతి గ్రహీతలకు ముందు వరసలో సీట్లు కేటాయిస్తారు. అదే బహుమతి ప్రదాతల్ని కనీసం గుర్తు కూడా పట్టరు. సభాస్థలి మీదకు ఆహ్వానం కూడా ఉండదు ప్రభుత్వ సంస్థల లోనే ఇలా జరుగుతూంటే ప్రైవేటు సంస్థల్లో జరిగే వాటికి చెప్పేదేం ఉన్నది. ప్రైవేటు సంస్థల్లో కార్య నిర్వహణ జరిగే దాకా దన హాయం పొందేదాకా కనిపించిన వ్యక్తులు ఆ తరువాత పొరపాటున కూడా కనిపించరు. కనీసం సభకు ఆహ్వానం కూడా అందదు. ఒక వేళ ఆహ్వానం అందినా కూడా సభకు వెళ్ళకూడదు. ఎందుకంటే? అక్కడ అవమానం పాలయ్యే కంటే వెళ్ళకుండా ఉండటమే మంచిది. మనమిచ్చిన విరాళాలతోనే వేదిక మీద దర్జాగా తిరిగే కార్య 'నిర్వాహకులకు దాతలు' పొరపాటున కూడా గుర్తుకు రారు. కాదు కాదు గుర్తుకు తెచ్చుకోరు. నిర్వాహకులు ప్రకటించిన బహుమతులు స్వీకరించే మేధావులు కూడా నిర్వాహకుల చుట్టూ తిరుగుతూ వాళ్ళను మెప్పించటానికే ప్రయత్నిస్తుంటారు. నిర్వాహకులు ఎక్కడి నుంచైనా, ఎవరి వద్ద నుంచైనా విరాళాలు తెచ్చి కార్యక్రమాలు చేసి తమ లాంటి కవులకు సన్మానాలు చేస్తారని ఆశ. పేరు నిర్వాహకులకు, సన్మానాలు రచయితలకు, అవమానాలు దాతలకు. తమ అక్షరాలకు పుస్తక రూపం కల్పించుకునే సమయంలో కవులకు సాహితి పోషకులు కావాలి. తమ అభిరుచి మేరకు సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించి సుమాజంలో పేరు తెచ్చుకునేందుకు నిర్వాహకులకు సాహితీ పోషకులు కావాలి. కానీ సాహితీ పోషకులకు తిరిగి ఏమి ఇవ్వరా? వారి వద్ద నుండి తీసుకోవటమే గానీ తిరిగి కనీసం కృతజ్ఞతలైనా మనస్ఫూర్తిగా చెప్పరా? వారికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు ఇవ్వరా? ఏదైనా పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటిస్తే గనుక ఆ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చిన దాతక్కూడా ఆ గౌరవం దక్కాలి. విశ్వవిద్యాలయాలు, సాహిత్య అకాడమీలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. సాహితీ పోషకులకు సముచిత గౌరవాన్ని ఇచ్చేలా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. ఈ పోషకులను, దాతలను గుర్తించాలని ఈ విషయమై ఆలోచించాలని కోరుకుటున్నారు.







## రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ

# 13వ వార్షికోత్సవం

**తెలంగాణ ప్రభ (నర్సాపూర్) :** నర్సాపూర్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి 13 వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు అనంతరం ఆమె అమ్మ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారుఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని అమ్మవారు వేడుకున్నారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ వైస్ చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సత్యం గౌడ్ నరసింహులు తోట వెంకటేష్ బాలరాజ్ జ్ఞానేశ్వర్ శ్రావణ్ ప్రసాద్ లక్ష్మి నారాయణ గౌడ్ ఓనర్ గారి శ్రావణ్ శ్రీనివాస్ కృష్ణ గౌడ్ బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు బిక్షపతి శ్రీనివాస్ రెడ్డి నరసింహారెడ్డి కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.